క్లుప్తంగా

అంతర్గత డ్రైనేజీ పనులను పరిశీలించిన కార్పొరేటర్

బాలానగర్: బాలానగర్ డివిజన్ పరిధిలోని వినాయక్‌నగర్‌లో చేపట్టిన అంతర్గత డ్రైనేజీ పనులను శనివారం బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి పరిశీలించారు. పనులను నాణ్యతా ప్రమాణాలు పాటించి త్వరగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు.

సీసీ రోడ్డు పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలి



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని కూకట్‌పల్లి గ్రామంలో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను స్థానిక కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ శనివారం పరిశీలించారు. పనులను వేగవంతం చేసి నాణ్యతా ప్రమాణాలు పాటించి, ప్రజలకు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఏఈ శివప్రకాష్, డివిజన్ అధ్యక్షుడు సంతోష్, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ 7వ ఫేజులో నివసించే నీరుడి కిష్టమ్మ కాలి గాయంతో చికిత్స చేయించుకుంది. దీంతో ఆర్థికంగా ఇబ్బంది పడి కూకట్‌పల్లి సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వరరావును సంప్రదించగా ఆయన ప్రభుత్వ పెద్దల సహకారంతో 60 వేల రూపాయలను మంజూరు చేయించారు. ఇందుకు సంబంధించిన చెక్కును శనివారం గొట్టిముక్కల వెంకటేశ్వరరావు ఆమె కుమారుడు ప్రవీణ్‌కు అందజేశారు.

నేడు 'ఐఎస్‌బీ'లో పుస్తకావిష్కరణ

రాయదుర్గం: గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)లో ఆదివారం నూతన పుస్తకావిష్కరణ కార్యక్రమం జరగనుంది. కేమ్కా ఆడిటోరియంలో సాయంత్రం 4.30 గంటలకు హరప్పా ఎడ్యుకేషన్ చైర్మన్, ఐఎస్‌బీ వ్యవస్థాపక డీన్ డాక్టర్ ప్రమత్‌రాజ్‌సిన్హా 'లెర్న్, డోన్ట్ స్టడీ' పేరిట రచించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం ఐఎస్‌బీ డీన్ ప్రొఫెసర్ మదన్‌పిల్లుట్లతో డాక్టర్ సిన్హా ముఖాముఖి కార్యక్రమం ఉంటుంది.

నూతన కార్యవర్గం

రాయదుర్గం: నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ శాఖ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ప్రకటించారు .అధ్యక్షుడిగా సీకే మహ్మద్ షరీఫ్, ఉపాధ్యక్షులుగా రేష్మాసమల్,అంజన్‌కుమార్, ప్రధాన కార్యదర్శులుగా ఎస్ రచనారెడ్డి, అజయ్‌కుమార్, కార్యదర్శులుగా షైన్‌మారియా, బాసిల్ జార్జ్, మహ్మద్ ఫయాజుల్‌హక్,ముకుంద్‌కుమార్, శాశ్వత ఆహ్వానితులుగా అమల్ జోస్‌ఫిలిప్, సీఎం సునీల్‌కుమార్, చాణక్య, సయూజ్‌అబ్రహం, కోశాధికారిగా సంగీత్‌ఆర్‌నాయర్, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్స్‌గా జర్నాపాధ్యాయ్, మహ్మద్‌నద్రన్, కార్యవర్గ సభ్యులుగా కెబిశ్రీరామ్, ఖాలీద్,శ్యాంసన్ గిడ్లా, దావిస్‌జేఅల్బ్రత్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు సీకేమహ్మద్ షరీఫ్ మాట్లాడుతూ హెచ్‌సీయూ విద్యార్థుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు.

నేడు 'మంచినీళ్ల పండుగ'

గచ్చిబౌలి: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఆదివారం 'మంచినీళ్ల పండుగ' పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ తెలిపారు. ఉదయం 10 గంటలకు మియాపూర్ డివిజన్‌లోని జేపీఎన్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, బీఆర్‌ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు, వార్డు, ఏరియా కమిటీ మాజీ సభ్యులు, ఉద్యమకారులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

జేపీఎన్‌నగర్‌లో..

మియాపూర్: డివిజన్ పరిధిలోని జేపీనగర్ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం మంచినీళ్ల పండుగ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే గాంధీ ఓ ప్రకటనలో తెలిపారు.

నిజాంపేట్ టీడీపీ నూతన కార్యవర్గం నియామకం

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ టీడీపీ నూతన కార్యవర్గాన్ని శనివారం టీటీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ ప్రకటించారు. అడ్వైజర్‌గా అనుమోల శ్రీనివాస్, కో.కోర్డినేటర్‌గా నాగేష్ ముదిరాజ్, అధ్యక్షుడిగా అనీల్ కరుటూరి, ఉపాధ్యక్షులు నందిగామ సత్యనారాయణ, కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, దోమ రామారావు, యడ్లపల్లి నాగేశ్వరరావుతదితరులను నియమించారు.

ట్రాఫిక్ టెర్రర్

- వివేకానందనగర్ డివిజన్‌లో వాహనదారుల ఇబ్బందులు
- పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు



వడ్డేపల్లి ఎన్‌క్లేవ్ చౌరస్తాలోని వైన్ షాపు ముందు ట్రాఫిక్

ఆల్విన్‌కాలనీ: ట్రాఫిక్ చక్రదిగ్బంధనంలో ఇరుక్కుపోయే ప్రయాణికులు ప్రతి రోజూ నానా తంటాలు పడుతున్నారు. వివేకానందనగర్ డివిజన్ వడ్డేపల్లి ఎన్‌క్లేవ్, బాలకృష్ణనగర్, రామారావునగర్‌ల మధ్యగల చౌరస్తా అసలే ఇరుకుగా ఉంటుంది. ఈ రహదారిలో ఒకవైపు వైన్‌షాపు, రెండు బార్‌లు ఉన్నాయి. ఈ ఇరుకైన రహదారికి గత కొద్ది రోజుల క్రితమే కూకట్‌పల్లి మెట్రో వద్ద నుంచి వాహనాల రాకపోకలు సాగించటానికి లింక్ రోడ్డును అనుసంధానం చేశారు. దీంతో ఈ రహదారిగుండా కూకట్‌పల్లి, హైటెక్ సిటీ నుండి వివిధ ప్రాంతాల ప్రజలు కుత్బుల్లాపూర్ సర్కిల్‌లోని జగద్గిరిగుట్ట, షాపూర్ నగర్, జీడిమెట్ల ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రహదారిలో ఉదయం, సాయంత్రం వేళల్లో పదుల సంఖ్యలో వాహనాలు ప్రయాణిస్తుంటాయి. ఈ రహదారిలో ఉన్న వైన్‌షాపు, బార్ల ముందు వాహనాలను పార్కింగ్ చేస్తుండటంతో ట్రాఫిక్‌కు ఇబ్బంది ఎక్కువగా మారింది. గతంలోనే ఈ ప్రాంతంలో పెద్ద ఎత్తున ట్రాఫిక్‌జాం అవుతుందని వైన్ షాపులు, బార్ల ముందు స్థానిక ప్రజలు ధర్నాలు కూడా చేపట్టారు. ఇక్కడ సమస్యను దృష్టిలో ఉంచుకొని జీహెచ్‌ఎంసి అధికారులు రోడ్డు మధ్యలో డివైడర్‌ను ఏర్పాటు చేశారు. డివైడర్ ఏర్పాటు చేసినప్పటికి వైన్ షాపుల ముందు మందుబాబులు క్రమ పద్ధతిలో వాహనాల పార్కింగ్ చేయకపోవటంతో గుంపులు గుంపులుగా రహదారులపై నిలుచొని బాతాఖాని కొట్టడం, మద్యం సేవించటంతో పాటు గొడవలకు కూడా దిగటంతో ప్రతిరోజూ ఈ ప్రాంత ప్రజలు నరకం చూడాల్సి వస్తుందని స్థానికులు పేర్కొంటున్నారు. కనీసం ఈ వైన్ షాపు, బార్లముందు సెక్యూరిటీ ఏర్పాటు చేసి వాహనాలను క్రమపద్ధతిలో పార్కింగ్ ఏర్పాటు చేసి బయట ఎవరూ మద్యం సేవించకుండా చర్యలు తీసుకొని అటుగా వచ్చే వారిపై దాడులకు దిగకుండా కట్టడి చేయాల్సిన బాధ్యత వారిదే. అయినప్పటికి ఇవేమి పట్టించుకోకుండా మద్యం అమ్మకంలో ఉన్న శ్రద్ధ దుకాణదారులకు రహదారిపై ప్రయాణించేవారి ఇబ్బందులు పట్టడం లేదు. సంబంధిత ఆబ్కారీ శాఖ అధికారులకు సైతం ఇలాంటి సంఘటనలు వారి దృష్టికి వెళ్లినా వారు కనీసం ఇటు వైపు చూడటం లేదని ఆరోపిస్తున్నారు. ఈ ప్రాంతంలో ట్రాఫిక్ ఇక్కట్లను గుర్తించి గత కొద్ది రోజుల క్రితం ట్రాఫిక్ అధికారులు ఈ రహదారికి ఇరువైపులా ఉన్న కాలనీల నిర్వాహకులు, కాలనీ వీధులకు గేట్లను ఏర్పాటు చేసుకున్నారు. ప్రతి రోజు ఈ కాలనీల గుండా వాహనదారులు రాకపోకలు సాగిస్తుండటంతో ఆ కాలనీ వాసులు గేట్లను ఏర్పాటు చేయటం ద్వారా మరింతగా ట్రాఫిక్ ఏర్పడటంతో ట్రాఫిక్ అధికారులు ఇటీవల వాటిని కూల్చివేసి రాకపోకలు సాగించేలా ఉండాలని మరోసారి గేట్లను ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయినప్పటికి ఈ ప్రాంతంలో ట్రాఫిక్ నియంత్రణకు ట్రాఫిక్ అధికారులు ట్రాఫిక్ ఏర్పడే ఉదయం, సాయంత్రం సమయంలో సిబ్బందిని ఏర్పాటు చేసి ప్రజలు సౌకర్యవంతగా ప్రయాణించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇంటింటికీ బీజేపీ భరోసా యాత్ర



కరపత్రాలు అందజేస్తున్న బీజేపీ నేతలు

ఓల్డ్ బోయిన్‌పల్లి: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు రాష్ట్రంలో కేసీఆర్ పాలన వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ నాయకులు ఇంటింటికీ బీజేపీ భరోసా యాత్రను కొనసాగించారు. శనివారం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లోని బృందావన్ కాలనీ, శ్రీరాం చరణ్ రెసిడెన్సీ ప్రాంతాలలో బీజేపీ సీనియర్ నాయకుడు వడ్డేపల్లి రాజేశ్వర్‌రావు అధ్వర్యంలో ఇంటింటికి పాదయాత్రలో మెడ్చేల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి, కూకట్‌పల్లి అసెంబ్లీ ఇంచార్జీ మాధవరం కాంతారావు నాయకులు పాల్గొని గడప గడపకు తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. రోడ్లను శుభ్రం చేసి చెత్తను రోడ్డు పక్కన కుప్పలుగా పేర్చి వదిలేస్తున్న పారిశుద్ధ్య కార్మికులపై అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసి పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు తమ దృష్టికి తెచ్చారన్నారు. నాయకులు సూర్యరావు, తిరుపతియాదవ్, సంతోష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం గౌడ్‌కు పలువురి జన్మదిన శుభాకాంక్షలు

ఆల్విన్‌కాలనీ: కుత్బుల్లాపూర్ నియోజకర్గం మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ జన్మదినం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి బీజేపీ నాయకుడు ఏకాంత్ గౌడ్ ఆయనకు భగవద్గీతను బహూకరించారు. కార్యక్రమంలో నాయకులు భానుయాదవ్, మరల శ్రీనూ, మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సేవాలాల్ నగర్‌లో అన్ని మౌలిక వసతులు



గిరిజన ఉత్సవాల్లో పాల్గొన్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, డీసీ రవికుమార్

కూకట్‌పల్లి: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం కూకట్‌పల్లిలోని ఎన్‌కేఎన్‌ఆర్ గార్డెన్స్‌లో రాష్ట్ర గిరిజన ఉత్సవాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హాజరై మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని రంగాల్లో తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళుతున్నారన్నారు. సేవాలాల్ మహారాజ్ జయంతిని సెలవు దినంగా ప్రకటించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బడుగు బలహీన వర్గాల కోసం సేవాలాల్ ఎంతో కృషి చేశారని, బాలాజీనగర్ డివజిన్‌లో సేవాలాల్‌నగర్ వాసులకు తాను అండగా ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో డీసీ రవికుమార్, సేవాలాల్ నగర్ వాసులు శంకర్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో పర్యాటక రంగం అభివృద్ధి

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ ఆవిర్భావం అనంతరం పదేళ్లలో పర్యాటక రంగం ఎంతో అభివృద్ధి చెందిందని ఆ శాఖ జనరల్ మేనేజర్ అంజిరెడ్డి అన్నారు. శనివారం ఓయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కాలేజీలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని పదేళ్లలో తెలంగాణలో పర్యాటక అభివృద్ధి–మేనేజ్‌మెంట్ దృక్కోణం అనే అంశం పై సదస్సు జరిగింది. కార్యక్రమానికి కాలేజీ ప్రిన్సిపల్ ప్రొ.శ్రీరాములు అధ్యక్షత వహించగా అంజిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై రాష్ట్రంలో అభివృద్ధి చెందిన వివిధ పర్యాటక ప్రాంతాల గురించి వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ప్రొ.నరేష్ రెడ్డితో పాటు ఇతర అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అపరిశుభ్ర వాతావరణంలో బిస్కెట్ల తయారీ.. యజమాని అరెస్టు

మోతీనగర్: ప్రభుత్వ అనుమతులు లేకుండా అపరిశుభ్ర వాతావరణంలో ఫైన్ బిస్కెట్లను తయారు చేస్తున్న యజమానిని అరెస్టు చేసినట్లు అల్లాపూర్ పోలీస్‌స్టేషన్ సిఐ శ్రీపతి ఆంజనేయులు తెలిపారు. శనివారం స్టేషన్ పరిధిలో తనిఖీలు చేపడుతున్న కానిస్టేబుల్ మహమ్మద్ మన్సూర్ ఆలం యూసుఫ్‌నగర్‌లో ఫైన్ బిస్కెట్ గోదామును తనిఖీ చేయగా గోదాం ఆవరణ పరిసరాలు అపరిశుభ్రంగా, చెత్తా చెదారం నిండి ఉంది. దీంతో బిస్కట్‌లు తయారు చేసే యజమాని ఖదీరును కానిస్టేబుల్ మహమ్మద్ మన్సూర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదుపులోకి తీసుకొని పోలీసేస్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ఖదీరుపై కేసు నమోదు చేసి ఏఎస్‌ఐ పాపయ్య పర్యవేక్షణలో దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేస్తాం



అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

మూసాపేట: బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని కేపీహెచ్‌బీ కాలనీ రోడ్డు నెంబర్ 1 నుంచి 15వ ఫేజ్, రాఘవేంద్ర కాలనీ, ముష్కి‌పేటలలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు కూకట్‌పల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, స్థానిక కార్పొరేటర్ శిరీష బాబూరావుతో కలిసి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ పార్కులు, సీసీ రోడ్ల నిర్మాణ పనులు ఎక్కడైతే పెండింగ్‌లో ఉన్నాయో వాటిని త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గ కో ఆర్డినేటర్ సతీష్ అరోరా, డివిజన్ అధ్యక్షుడు సిహెచ్ ప్రభాకర్ గౌడ్, బాలాజీనగర్ డివిజన్ కార్యదర్శి వెంకటేష్ చౌదరి పాల్గొన్నారు.

ప్రారంభోత్సవం



కూకట్‌పల్లిలోని అశోకవన్ మాల్‌లో హనీ హనీ స్టోర్‌ను శనివారం ప్రారంభిస్తున్న సానియా మీర్జా సోదరి ఆనం మీర్జా దంపతులు, మాజీ క్రికెటర్ అజారుద్దీన్ కుమారుడు మహమ్మద్ అసదుద్దీన్ - కూకట్‌పల్లి

బకెట్ క్లీనింగ్ ద్వారా డ్రైనేజీ సమస్యకు పరిష్కారం



డ్రైనేజ సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని మిత్ర హిల్స్‌లో తలెత్తిన డ్రైనేజీ సమస్యను శనివారం కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిత్ర హిల్స్ కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు కాలనీలో పర్యటించామన్నారు. కాలనీలో నెలకొన్న డ్రైనేజీ సమస్యను బకెట్ క్లీనింగ్ ద్వారా చేపట్టాలని, పేరుకుపోయిన పూడికను తీయాలని, అదే విధంగా డ్రైనేజీ నీరు సాఫీగా ప్రవహించేలా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జలమండలి మేనేజర్ ప్రశాంతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించండి



కేపీహెచ్‌బీ కాలనీలో డ్రైనేజీ సమస్యను పరిశీలించిన పన్నాల హరీష్ రెడ్డి తదితరులు

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీకాలనీ టెంపుల్ బస్టాప్‌లోని రావూస్ ఈఎస్‌టీ ఆసుపత్రి రోడ్డులో ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలని మేడ్చల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పన్నాల హరీష్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ వీధిలో గత పది రోజులుగా డ్రైనేజీ పొంగి పొర్లుతోందని స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా ఎటువంటి చర్యలు చేపట్టకుండా వదిలివేయటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో శనివారం హరీష్ రెడ్డి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. తక్షణమే అధికారులు, ప్రజాప్రతినిదులు దీనిపై డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి పట్లోళ్ల సాయినాథ్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు గంధం రాజు పాల్గొన్నారు.

వార్డు కార్యాలయాలను తనిఖీ చేసిన జెడ్‌సీ



వార్డు కార్యాలయాన్ని పరిశీలిస్తున్న జెడ్‌సీ మమత

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలో ఏర్పాటు చేసిన పలు వార్డు కార్యాలయాలను శనివారం జోనల్ కమీషనర్ మమత ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ పనిచేస్తున్న అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందజేశారు. కేపీహెచ్‌బీకాలనీ, వివేకానందనగర్, అల్విన్‌కాలనీ వార్డు కార్యాలయాలు పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్‌ఇ చెన్నారెడ్డి, ఇఇ గోవర్ధన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు హెల్త్ కార్డుల పంపిణీ...

కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో శనివారం జోనల్ కమిషనర్ పలువురు జీహెచ్‌యంసి ఉద్యోగులకు హెల్త్ కార్డులు అందజేశారు. ఈ హెల్త్ కార్డు ద్వారా ఉద్యోగులు రూ.3 లక్షల వరకు బీమా సౌకర్యం ఉంటుంది.

బోనాల పండగ నిధులకు దరఖాస్తు చేసుకోండి

మియాపూర్: శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో బోనాల పండుగ నిర్వహణకు ఆలయ నిర్వాహకులు నిధులు పొందడానికి జూన్21 లోగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే గాంధీ తెలిపారు. గుడి పేరు మీద ఉన్న లెటర్ హెడ్, 'గుడి పేరు మీద ఉన్న బ్యాంకు పాస్ బుక్ జిరాక్స్, గుడి ఫొటోలు, దేవాలయ చైర్మన్ , కార్యదర్శి ఆధార్ కార్డు జిరాక్స్‌లతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి



సంఘటనా స్థలంలో మృతదేహం

భాగ్యనగర్‌కాలనీ: గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. నెల్లూరు జిల్లా గంగపట్నంకు చెందిన కొండూరు జనార్ధన్‌రెడ్డి, (47) విజయవాడలోని ఓ సేవ సంస్థలో పనిచేస్తున్నాడు. సంస్థకు చెందిన పనిమీద హైదరాబాద్ నగరానికి వచ్చారు. ఈ క్రమంలోనే శనివారం కేపీహెచ్‌బీ మెట్రోస్టేషన్ పిల్లర్ నెంబర్ 744 వద్ద రోడ్డు దాటుతుండగా జేఎన్‌టీయు వైపు నుంచి అతి వేగంగా వచ్చినగుర్తు తెలియని వాహనం ఢీ కొట్టి వెళ్లింది. మృతుడి తలపై నుంచి వెళ్లడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు.కూకట్‌పల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతుడి వద్ద ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా మృతదేహాన్ని గుర్తించి వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

ట్రిపుల్ ఐటీలో 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' ఏర్పాటు

రాయదుర్గం: ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, ఎమర్జింగ్ టెక్నాలజీస్ కోసం ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ క్యాంపస్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేసేందుకు శనివారం ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్, గోల్డ్‌మన్‌సాచ్‌లు సంయుక్తంగా నిర్ణయించారు. ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డీన్ ప్రొఫెసర్ జవహర్ మాట్లాడుతూ గోల్డ్ మ్యాన్ సాచ్ సహకారంతో ఏఐ యొక్క అప్లికేషన్స్, ఫైనాన్స్ రంగంలో అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు కనిపిస్తాయన్నారు. గోల్డ్‌మ్యాన్ సాచ్స్ సర్వీసెస్ ఇండియా చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రవికృష్ణన్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా కొత్త సాంకేతికతలు, పరిష్కారాల అభివృద్ధికి పరిశ్రమ, విద్య భాగస్వామ్యాలు కీలకంగా ఉన్నాయన్నారు.

ఓయూలో అక్రమ నిర్మాణాల కూల్చివేత

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలోని పలు అక్రమ నిర్మాణాలను శనివారం ఏబీవీపీ నాయకులు జీవన్ శ్రీహరి ఆధ్వర్యంలో 20 మంది విద్యార్థులు కూల్చివేశారు. నిర్మాణాలను అడ్డుకున్న ఏబీవీపీ నాయకులపై దాడి చేసిన కబ్జాదారులపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా అక్రమ నిర్మాణాల ప్రాంతాలను ఓయూ ఉద్యోగ సంఘాల నాయకులు, అధ్యాపక సంఘం నాయకులు సందర్శించి భూములను కబ్జా చేస్తే సహించేది లేదన్నారు. విద్యార్థులపై దాడిని ఖండిస్తున్నామన్నారు.

హ్యాండ్ రైటింగ్‌లో ఉపాధ్యాయులకు శిక్షణ

కుత్బుల్లాపూర్: చింతల్ వెంకటేశ్వరనగర్‌లోని బచ్‌పన్ ప్లేస్కూల్‌లో శనివారం టీవీఆర్ గ్రూప్ స్కూల్స్ ఉపాధ్యాయులకు హ్యాండ్ రైటింగ్‌లో శిక్షణ తరగతులు నిర్వహించారు. హ్యాండ్‌రైటింగ్ శిక్షకులు, లక్కీస్ హ్యాండ్‌రైటింగ్ అకాడమీ డైరెక్టర్ దేవి ఆధ్వర్యంలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు ఈ ట్రైనింగ్ శిబిరం కొనసాగింది.

జర్నలిస్టు కుటుంబాలకు వైద్యంలో రాయితీ



రాందేవ్ రావ్ ఆసుపత్రి డైరెక్టర్ కల్నల్ కమలాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కూకట్‌పల్లి ప్రెస్ క్లబ్ నాయకులు

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లిలోని రాందేవ్ రావ్ ఆసుపత్రిలో జర్నలిస్టుల కుటుంబ సభ్యులకు 50శాతం రాయితీతో కూడిన వైద్య సదుపాయాలు అందించేందుకుగాను ఆసుపత్రి నిర్వాహకులు సానుకూలంగా స్పందించారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం మేడ్చల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం ఆసుపత్రి హెల్త్ డైరెక్టర్ డాక్టర్ కల్నల్ కమలాకర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు గడ్డమీది బాలరాజు మాట్లాడుతూ కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ పరిసర ప్రాంతాల్లో నివాసముంటున్న జర్నలిస్టుల కుటుంబాలకు ఆరోగ్యపరమైన రక్షణ కల్పించాలని కోరామని తెలిపారు. డాక్టర్ కమలాకర్, డాక్టర్ యోబు మాట్లాడుతూ రాందేవ్ రావు ఆసుపత్రిలో అన్ని రకాల వైద్య సేవలను అందుబాటులో ఉంచామని తెలిపారు. కుటుంబ సభ్యుల వివరాలు, పాస్‌పోర్టు సైజ్ ఫోటో, ఆధార్ కార్డులు, దరఖాస్తులు అందించాలని సూచించారు. వీటిని పరిశీలించి జర్నలిస్టు కుటుంబ సభ్యులకు రాయితీ కార్డులను అందజేస్తామని తెలిపారు. 400 మంది విలేకరులకు రాయితీ కార్డులను అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కరీం, వర్కింగ్ ప్రెసిడెంట్ నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ లీకేజీ సమస్యను పరిష్కరించండి



సుభాష్‌నగర్: రద్దీగా ఉండే రోడ్లలో డ్రైనేజీ లీకేజీ ఏర్పడితే రాకపోకలకు ఇబ్బంది కలగకుండా గంటల వ్యవధిలో సమస్యను పరిష్కరించాలి. కానీ సంబంధిత అధికారులు ఆ దిశగా పనులు చేయడం లేదనడానికి ఈ చిత్రాన్ని నిదర్శనంగా తీసుకోవచ్చు. షాపూర్‌నగర్ నుండి గాజులరామారం వెళ్లే ప్రధాన రోడ్డులో సంజయ్ గాంధీనగర్ వద్ద గురువారం ఉదయం డ్రైనేజీ చిన్నగా లీకేజీ అయింది. కాస్త ఇంత పెద్ద గొయ్యిగా మారి రోడ్డు కుంగిపోయింది. ప్రధాన రోడ్డులో డ్రైనేజీ నీరు చేరి మురికిగుంటలా మారింది. ప్రధాన రోడ్డులో ఇంత సమస్య ఉన్నా సంబంధిత అధికారులు అటువైపు రాలేకపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.